క్లుప్తంగా

పీజీఆర్‌ఎస్ ఆడిట్ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిడ్యాల: మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్ ఆడిట్‌ను బుధవారం ఎంపీడీఓ సుమిత్రమ్మ పరిశీలించారు. పాత ముచ్చుమర్రిలో 150 మంది అర్జీదారులు, కొత్త ముచ్చుమర్రి 16 మంది అర్జీదారుల కుటుంబాలను కలిసి వారి సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. మిగతా సర్వేలను పరిశీలించి వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఖాశీం, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయండి



తర్తూరులో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ రేష్మ

జూపాడుబంగ్లా: కొలతల ప్రకారం పనులు చేసి గరిష్టంగా రూ.300 కూలీని పొందాలని ఏపీఓ రేష్మ ఉపాధి శ్రామికులకు సూచించారు. బుధవారం ఆమె మండలంలోని తర్తూరు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల మస్టర్‌రోల్స్‌ను తనిఖీ చేసి పనులకు హాజరైన కూలీల వివరాలు తెలుసుకున్నారు. హాజరులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. తమకు ఏడు వారాల నుంచి వేతనాలు అందలేదని కూలీలు ఏపీఓ దృష్టికి తీసుకురాగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు.

కొలనుభారతి క్షేత్రంలో పూజలు



పూజలందుకున్న అమ్మవారు

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి దేవి అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉత్తరాయణం శుక్ల పక్షం, వసంత ఋతువు కృతిక కార్తె బహుళ నవమి తదుపరి దశమి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ పురోహితులు శ్రీవాస శర్మ అమ్మవారికి ఉదయకాలంలో అభిషేకాలు, అర్చనలు, మంగళహారతి తదితర విశేష పూజలు చేశారు.

షరతులు లేకుండా రేషన్‌కార్డులు ఇవ్వాలి

ఆత్మకూరు: షరతులు లేకుండా రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఎం నాయకుడు ఎ.రణధీర్ కోరారు. బుధవారం సుదర్శనవర్మ భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఎ.రణధీర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రేషన్‌కార్డుల తొలగింపు, చేర్పుల కార్యక్రమాల్లో భాగంగా షరతులను ఎత్తి వేయాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, షేక్ ఇస్మాయిల్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

నందికొట్కూరు: ప్రతి రోజు 4 వేల మందికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. బుధవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ307 వేతనం వచ్చే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు అధిక సంఖ్యలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్ షభానా, ఏపీఓ నాగమ్మ పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

నందికొట్కూరు: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.24 లక్షలు తీసుకుని మోసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు బుధవారం తెలిపారు. హోం, రెవెన్యూ శాఖకు సంబంధించి సెక్రటేరియట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన సయ్యద్ విక్ర, సమీవున్నీసాబేగం, యూనూస్, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలుకు చెందిన ఫిరోజ్‌ఖాన్ రూ.24 లక్షలు తీసుకున్నట్లు పటాన్ ఖాదర్‌వలి ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ తెలిపారు. విచారణ చేసి నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

మట్టి పరీక్ష...భూమికి రక్ష

- ఫలితాలను బట్టి ఎరువుల వినియోగం.. పంట మార్పిడి
- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో 4,612 మట్టినమూనాల సేకరణ

మట్టి పరీక్షలు భూమికి రక్షణగా నిలుస్తున్నాయి. ఫలితాలను బట్టి ఎరువులను వేసుకోవడం, పంట మార్పిడి చేపట్టడం వల్ల అధిక దిగుబడులు కూడా సాధించవచ్చు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రల సిబ్బందితో రైతుల పొలాల్లోని మట్టి నమూనాలు సేకరించి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లో పరీక్షించి ఫలితాలను రైతులకు వివరించడంతోపాటు ఎరువులు సరఫరా చేసేవారు. ఏ పంట వేసుకోవాలో కూడా సూచించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు 6,168 మట్టినమూనాలు సేకరించాల్సి ఉండగా 4,612 మట్టి నమూనాలు సేకరించింది.



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

జూపాడుబంగ్లా: నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌కుగాను 1,53,750 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉంది. నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, పాములపాడు, మిడ్తూరు, కొత్తపల్లి మండలాల్లోని 73రైతుసేవా కేంద్రాల పరిధిలో 4,140 మట్టినమూనాలు సేకరించాల్సి ఉండగా 3,324 సేకరించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల పరిధిలో 49రైతుసేవా కేంద్రాల అధ్వర్యంలో 2,028 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉండగా 1,288నమూనాలు సేకరించారు. ఈనెల 15 నాటికే మట్టినమూనాల సేకరణ గడువు పూర్తికాగా పొడగించినట్లు పేర్కొంటున్నా నిర్ణీత గడువు వెల్లడించలేదు.

భూసారపరీక్షలు ఎందుకు చేయించుకోవాలంటే..

రైతుల పొలాల్లోని మట్టిలో పంటలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం లతో పాటు మెగ్నిషియం, ఐరన్, జింక్ తదితర సూక్ష్మ పోషకాలు ఎంతమోతాదులో ఉన్నాయనే విషయం బహిర్గతం అవుతుంది. తద్వారా నిర్ణీత మోతాదులో రైతులు రసాయనిక ఎరువులు వినియోగించుకొనే అవకాశం లభిస్తుంది. మట్టి పరీక్షలు చేయించుకోకపోవటం వల్ల పొలంలో ఎంత మోతాదులో నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మపోషకాలు ఉన్నాయో తెలిసి పోతుంది. దానికి అనుగుణంగా ఏఏ పంటల సాగుకు అనుకూలమో తెలుస్తుంది. ఏఏ ఎరువులు వేయాలో, ఎంత మోతాదులో మందులు వేయాలో వ్యవసాయాధికారులు సూచించేందుకు అవకాశం ఉంటుంది.

ఫలితాలను బట్టి ఎరువుల వినియోగం

సేంద్రియ, రసాయనిక, జీవన ఎరువులు అని మూడు రకాలు. రసాయనిక ఎరువులు భూమిలో సహజంగా 4:2:1నిష్పత్తిలో నత్రజని, భాస్వరం, పొటాషియం ఉండాలి. ఈ నిష్పత్తిని అనుసరించి రసాయనిక ఎరువులు వినియోగించుకోవాలి. సేంద్రియ ఎరువులు ఎరువుల్లో స్థూల సేంద్రియ ఎరువు, పశువుల ఎరువు, కంపోస్టు, చిక్కటి సేంద్రియ ఎరువులు, వేపపిండి, ఆముదపు పిండి(నూనె చెక్కలు, పిండిఎరువులు). సేంద్రియ ఎరువులైన జీలుగ, ఆవులు, బర్రెలు, గొర్రెల పేడన కంపోస్టు ఎరువు, వేపపిండి, ఆముదపు పిండిని ఖరీఫ్ పంటలు సాగుచేయటానికి నాలుగు వారాల ముందు పొలంలో చల్లుకొని యలియదున్నాలి. భూసార పరీక్షలు చేయించుకున్న తర్వాత వాటిల్లో నతరజని, భాస్వరం, పొటాషియం, నిష్పత్తిని అనుసరించి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల పాటించి సరైన సమయంలో రసాయనిక ఎరువులను పంటలకు వేసుకోవాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులు వినియోగిస్తే భూసాంద్రత దెబ్బతిని పంటల దిగుబడి లోపిస్తుంది. రసాయనిక, సేంద్రియ ఎరువులు 60:40 నిష్పత్తిలో వినియోగించుకోవాలి.

భూసాంద్రత వివరాలు తెలుస్తాయి

ఏటా రైతులు భూసార పరీక్షలుచేయించుకోవటం మంచిది. భూసార పరీక్షల వల్ల భూమిలో ఉండాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం శాతంతో పాటు సూక్ష్మపోషకాల నిష్పత్తి తెలుస్తుంది. దాన్ని అనుసరించి నిర్ణీత మోతాదులో రసాయనిక ఎరువులు వాడుకోవచ్చు. ఎరువులు ఇష్టానుసారంగా వినియోగిచటం వల్ల భూసాంద్రత లోపించి పంటల దిగుబడి తగ్గుతుంది. గతంలో భూసార పరీక్షలు చేయించుకోవటం కష్టంగా ఉండేది. ప్రస్తుతం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులు వారి పొలాల్లోని మట్టిని సేకరించి ల్యాబుకు పంపిస్తే చాలు వాటి వివరాలను విశదీకరించి రైతులకు తెలియజేస్తారు.

– విజయశేఖర్, ఏడీఏ, నందికొట్కూరు

నేడు హనుమాన్ రథోత్సవం



ముస్తాబైన అభయాంజనేయ స్వామి

పగిద్యాల: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని కొత్త ముచ్చుమర్రి అభయాంజనేయ స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం సీతారామ లక్ష్మణస్వామి, చెన్నకేశవస్వామి, అభయాంజనేయ స్వామి వార్లకు పంచామృతాభిషేకం, సిందూర లేపనం, వస్త్రాలంకరణ, పూలమాలలతో అలంకరణ, పుష్పార్చనం, నాగవల్లి పూజ, తమలపాకులతో ఆకుపూజ, వడమాల సేవ, మహామంగళ హారతి కార్యక్రమాలను పురోహితులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 6.30 గంటలకు భక్తజన సందోహం మధ్య అభయాంజనేయ స్వామి రథోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

- మహానంది: హనుమజ్జయంతి సందర్భంగా మహానంది మండలంలో గురువారం వేడుకలు నిర్వహించనున్నారు. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు గాజులపల్లె ఆర్‌ఎస్, తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.
- శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని గురువారం పాతాళగంగ మార్గంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు.
- నున్నిపెంట గ్రామంలో పంచముఖి ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో హనుమాన్ జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు శ్రీధర్ శర్మ తెలిపారు.

అంధకారంలో ఎన్‌టీఆర్ కాలనీ

ఆత్మకూరు: బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామంలోని ఎన్‌టీఆర్ కాలనీ వీధి బల్బులు వెలుగక అంధకారంలో మగ్గుతోంది. కాలనీలో సుమారు 100కి పైగా కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 2 నెలల నుంచి వీధి బల్బులు వెగడం లేదు. కాలనీ చుట్టూ పొలాలు, పంట కాలువలు ఉండటంతో విష పురుగుల సంచారం ఎక్కువగా ఉంటోంది. కాలనీ అంతా అంధకారంలో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే వీధి బల్బులు ఏర్పాటు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



విద్యుత్ బల్బు వెలగని స్తంభం

‘చలో సిద్ధేశ్వరం’ పోస్టర్ల విడుదల



చలో సిద్ధేశ్వరం వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: ఈనెల 31న చలో సిద్ధేశ్వరం బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్ న్యూ డెమొక్రసీ) జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో చలో సిద్ధేశ్వరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ వెనుకబాటు తనానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. రాయలసీమ ప్రాంతంలో కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యలు నిరంతరం జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.17 కోట్లతో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సిద్ధేశ్వరం ప్రాజెక్టు అలుగు నిర్మాణం చేపట్టే వరకు ఉద్యమం ఆగదన్నారు. సభకు విద్యావంతులు, విద్యార్థులుమ రైతులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రత్నం ఏసేపు, పార్టీ నాయకులు మజీద్‌మియ్య, ఆంజనేయులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నాయకులు జయరాం, కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వరగౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆత్మకూరు: బండిఆత్మకూరు మండల పరిధిలోని సింగవరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై ఎస్‌ఐ జగన్‌మోహన్ బుధవారం అవగాహన కల్పించారు. ఓటీపీ, ఈ–కేవైసీల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. గ్రామంలో ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

స్కూటర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

– ఒకరు మృతి... మరొకరికి గాయాలు



బస్సు ఢీకొట్టిన సంఘటనలో గాయాలకు గురైన సిద్ధయ్య, సయ్యద్

కర్నూలు : కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ సమీపంలో (శ్రీనివాస గార్డెన్)కు ఎదురుగా కుంభకోణం హోటల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నందికొట్కూరు గ్రామానికి చెందిన పింజరి సిద్దయ్య(59) మృతిచెందారు. ముల్లా సయ్యద్ గాయాలకు గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిద్దరూ కర్నూలు లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం స్కూటీపై నందికొట్కూరు నుంచి కర్నూలుకు వస్తుండగా కర్నూలు నుంచి ఆత్మకూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో స్కూటర్‌ను వేగంగా వెళ్లి ఢీకొట్టడంతో సిద్దయ్య, సయ్యద్ బైక్ పైనుంచి కింద పడ్డారు. సిద్ధయ్య కాలు విరిగిపోవడమే కాక తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఇరువురినీ కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కొద్దిసేపటికే సిద్దయ్య మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బైక్ నడుపుతూ గాయాలకు గురైన సయ్యద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన సిద్ధయ్యకు ఇద్దరు కుమారులు సంతానం.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ సమీపంలోని నేషనల్ హైవే వద్ద నూతన ఆటో స్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమగా గుర్తించి ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. 55 ఏళ్లు దాటిన ఆటో కార్మికులకు సామాజిక పింఛన్ రూ.6 వేలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మోటార్ వెహికల్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోలపై అధిక జరిమానాలు విధించేందుకు తెచ్చిన 21జీఓను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు నాగేంద్ర, మాలిక్, నాగేశ్వరరావు, నాగరాజు, శేషాద్రిగౌడు, ప్రవీణ్, శ్యామ్‌రాజు, చింటూ, ఏసన్న, రాజు పాల్గొన్నారు.



ఆటో స్టాండ్‌ను ప్రారంభించిన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి

గ్రీన్ కో కంపెనీకి భూములప్పగిస్తే ఉద్యమం

నందికొట్కూరు: మిడుతూరు మండలం పైపాలెం గ్రామం వద్ద ఉన్న భూములను గ్రీన్ కో కంపెనీకి అప్పగిస్తే ఉద్యమిస్తామని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్ హెచ్చరించారు. బుధవారం జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పైపాలెం గ్రామ చుట్టూ 4 వేలకు పైగా ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ భూములను కంపెనీలకు అప్పగిస్తే పశువులకు మేత లేక అల్లాడిపోయే ప్రమాదం ఉందన్నారు. 4 వేల ఎకరాల్లో పెద్ద చెరువు ఉందని, ఈ చెరువుకు హంద్రీనీవా కాలువ నుంచి నీటిని తరలిస్తే 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలగనూర్ రిజర్వాయర్ మరమ్మతులను చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల అర్లప్ప, నాయకులు సోమన్న, రమేష్, నరసయ్య, శేఖర్ పాల్గొన్నారు.

మేట్ల రిజిస్ట్రేషన్ చేసి ఎన్‌ఎంఎంఎస్ యాప్ ఇవ్వాలని ఏపీఓ ఆదేశం

జూపాడుబంగ్లా: ఈనెల 14న ‘సాక్షి’ దినపత్రికలో ‘మేట్ల రిజిస్ట్రేషన్‌పై నిర్లక్ష్యధోరణి’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఏపీఓ రేష్మ స్పందించారు. ఉపాధి టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించి మేట్ల రిజిస్ట్రేషన్ చేసి వారి సెల్‌ఫోన్లలో ఎన్‌ఎంఎంఎస్ యాప్ అప్‌లోడ్ చేసి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎన్‌ఎంఎంఎస్ యాప్ మ్యాపింగ్ చేయించుకున్న మేట్లు వారి పరిధిలోని గ్రూపుల్లో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు సక్రమంగా హాజరువేయాలని ఆదేశించారు.

నలుగురిపై కేసు నమోదు

పగిద్యాల: నాలుగు తులాల బంగారు విషయంలో ఘర్షణపడి దాడి చేసిన ఘటనలో నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. లక్ష్మాపురం గ్రామానికి చెందిన శరత్‌గౌడ్ డోన్ మండలం ఉంగరానిగుంట్ల గ్రామానికి చెందిన దస్తగిరి, విరూపాక్షమ్మ కూతురు ధనలక్ష్మిని నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సమయంలో భార్యకు చేయించిన నాలుగు తులాల బంగారు విషయమై తరచూ భార్యాభర్తలు గొడవ పడుతూ వస్తున్నారు. ఈనెల 19న భార్య తల్లిదండ్రులు, బావమర్దులు లక్ష్మాపురం వచ్చి సురేష్‌రెడ్డి ఇంటి వద్ద ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో మధుగౌడ్ కర్రతో శరత్‌గౌడ్ తలపై కొట్టడంతో రక్తగాయాలు కాగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ఉదయం స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో నిందితులు దస్తగిరి, చిన్నమద్దిశంకర్‌గౌడ్, మధుగౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల 2000–01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం మహానందిలో సమావేశమయ్యారు. అందరూ ఒకే చోట చేరి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆప్యాయంగా గడిపారు. – మహానంది

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: పట్టణ పరిధిలోని నీలిషికారిపేటలో ఉన్న సారా బట్టీలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ లక్ష్మణ్‌దాసు, నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్, ఆత్మకూరు సీఐ కిశోర్‌కుమార్ తమ సబ్బందితో బుధవారం మూకుమ్మడిగా దాడుల నిర్వహించారు. సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నీలిషికారి మీనాక్షి, గంగ నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు జఫ్రుల్లా, జగదీష్, పోలీసులు పాల్గొన్నారు.



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆర్థిక సాయం

మహానంది: మహానందిలోని నాగనంది సదనం వద్ద పాత గదులను తొలగిస్తున్న క్రమంలో పెచ్చులూడి పడిన ఘటనలో మృతి చెందిన రెండు కుటుంబాలకు రూ.2లక్షలు ఆర్థిక సాయం అందించినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కార్యాలయం వద్ద ప్రమాదంలో మృతి చెందిన వెంకటరాముడు, వెంకటేశ్వర్లుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

సన్మానం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ మున్సిపల్ వింగ్ స్టేట్ సెక్రటరీ విజయ్‌ను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ మున్సిపల్ వింగ్‌లో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. మరింత బాధ్యతతో పని చేస్తానన్నారు.



విజయ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎడతెరిపినివ్వని వర్షాలు



మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం

పాములపాడు: శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో వర్షాలు ఎడతెరిపినివ్వడం లేదు. పాములపాడు మండల కేంద్రంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఏపీ మోడల్ స్కూల్ పరిసర ప్రాంతంలోని వేప చెట్టుపై పిడుగు పడింది. గ్రామంలోని గయ్యి గుంతల వద్ద తెలుగుగంగ నుంచి 33కేవీ లైన్ 8 విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇన్సులేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కొత్తవి అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

తెలికపాటి వర్షం

కొత్తపల్లి: మండలంలో బుధవారం ఉదయం, సాయంత్రం సమయాల్లో తెలిపాటి వర్షం పడింది. ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం, ఎం.లింగాపురం, గోకవరం, జడ్డువారిపల్లె, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, బావాపురం, జి.వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో తెలికపాటి వర్షం పడింది. రెండుమూడు రోజులు అధిక వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు.

జూపాడుబంగ్లా: బుధవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షానికి జూపాడుబంగ్లా, తాటిపాడు, తంగడంచ, గ్రామాల్లోని వీధుల్లో వర్షం నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. జూపాడుబంగ్లాలోని కర్నూలు–గుంటూరు రహదారి వెంట డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో కేజీ రోడ్డు వెంట వర్షం నీటి నిలిచిపోవటంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు.

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిసరాలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం ప్రారంభమైంది. ఉదయం నుంచి ఆకాశంలో ఎండ లేకపోగా మబ్బులు కమ్మిన మేఘాలు దర్శనమిచ్చాయి. గత నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గాయి.



వేప చెట్టుపై పిడుగు పడిన దృశ్యం



జూపాడుబంగ్లా ముస్లిం కాలనీ సమీపంలో కేజీ రోడ్డుపై భారీగా నిలిచిన వర్షం నీరు